లక్ష్యం కోసం పట్టుదలగా వేచి చూడాలి తప్ప మధ్యలో దాన్ని ఆపకూడదన్న సత్యాన్ని గ్రహించాడు. ప్రాపంచిక విషయాల్లో సాధించడానికే ఆమె అంత పట్టుదలతో వుంటే, దానికన్నా ఇంకా కష్టతరమైన ఆధ్యాత్మికతలో సాధించడానికి తను ఇంకా ఎంత పట్టుదలతో వుండాలి?

దాంతో అతను ప్రాపంచిక దుస్తులని విడిచి, కాషాయ వస్త్రాలని మళ్ళీ ధరించి తన లక్ష్యం సాధించడానికి తిరిగి హిమాలయాలకి వెళ్ళిపోయాడు. అతను తన తుది శ్వాసని భగవన్నామస్మరణతో వదలడంతో మరణ సమయంలో మోక్షాన్ని సాధించాడు.

## 33. ఏనుగు స్నానం

తమ గ్రామ రచ్చ బండ దగ్గర కూర్చుని తోటి గ్రామస్థులతో ఇచ్చకాలాడుతున్న ఒకడు దూరంగా వెళ్తున్న ఓ సాధువుని చూసాడు. అతను ధ్యాన సాధకుడు కాబట్టి ఆయన దగ్గరకి పరుగెత్తుకుని వెళ్ళి పాద నమస్కారం చేసి తనకి ఏదైనా మంచి ఉపదేశం ఇవ్వమని కోరాడు.

"ఏనుగు స్నానం మాను." అతన్ని ఎగాదిగా చూసి చెప్పి వెళ్ళిపోయాడు ఆ సాధువు.

ఏనుగు స్నానం అంటే ఏమిటో అతనికి బోధపడలేదు. రచ్చబండ దగ్గరకి వెళ్ళి అక్కడ ఉన్న పది మందికీ సాధువు తనకి చెప్పిన మాటలని చెప్పి అడిగాడు.

"మీలో ఎవరికైనా ఏనుగు స్నానం అంటే ఏమిటో తెలుసా?"

ఎవరూ ఆధ్యాత్మికమైన వివరణని ఇచ్చే సమాధానాన్ని చెప్పలేకపోయారు.

"మన గ్రామం అవతల అడవిలో గల చెరువులోకి ఏనుగులు తరచు వచ్చి స్నానాలు చేస్తూంటాయి. వెళ్ళి వాటి స్నానం చూస్తే ఆ సాధువు మాటలకి అర్థం తెలియచ్చు." ఒకరు సలహా ఇచ్చారు.

అతను మర్నాడు ఉదయం అడవిలోని చెరువు దగ్గరకి వెళ్ళి చూస్తే, ఓ ఏనుగు అప్పుడే చెరువులోకి దిగుతూ కనిపించింది. అతను ఆసక్తిగా దాన్ని

చూసాడు. నీళ్ళని అల్లకల్లోలం చేస్తూ అది తొండంతో నీళ్ళని తన వంటి మీద చల్లుకుని, శుభ్రంగా మురికి వదిలేలా స్నానం చేసింది. గట్టు మీదకి రాగానే తిరిగి తొండంతో మట్టిని తీసుకుని ఒళ్ళంతా చల్లుకుని వెళ్ళిపోయింది.

వెంటనే సాధువు తనకి ఏం చెప్పాడో అతనికి బోధ పడింది. తను నిత్యం ధ్యానం, భజనలనే స్నానం చేస్తూ పూర్వం చేసిన దుష్కర్మలనే మురికిని వదిలించుకుంటున్నాడు. తిరిగి లోక వ్యవహారాల్లోకి రాగానే, పాపాలు చేస్తున్నాడు. అతనికి సాధువు హితబోధ అర్థం అవడంతో రచ్చబండ దగ్గర చేరి వాళ్ళ మీద, వీళ్ళ మీద నిందలు వినడం, చెప్పడం లాంటి చెడు పనులన్నిటినీ ఆ రోజుతో కట్టిపెట్టాడు.

## 34. రెండు భాగాలు

ఓ సాధువు ఓ గ్రామానికి వచ్చాడు. అక్కడి రామాలయంలో ఆ రోజు బ్రహ్మోత్సవం జరుగుతోంది. ఉదయం నించి సాయంత్రం దాకా అతను ఆ గ్రామస్థుల చర్యలన్నిటినీ గమనించాడు. సాయంత్రం ఆయన చెప్పే సత్సంగానికి గ్రామస్థులంతా హాజరయ్యారు.

"మా భక్తి ఎలా ఉంది స్వామి?" ఒకరు అడిగారు.

"బావుంది కాని మీ భక్తి మతపరమైంది. అక్కడితో ఆగే భక్తి వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు." జవాబు చెప్పాడు ఆ సాధువు.

"అదేమిటి స్వామి?"

"అవును. ప్రతీ మతానికి రెండు భాగాలుంటాయి. బయటిది. లోపలిది. బయటది ఆచారాలకి సంబంధించింది. అది మేధావుల చేత ఏర్పరచబడినది. లోపలిది వేదాంత లేదా ఆధ్యాత్మిక భాగం. బయటి దానికి విలువ ఇచ్చేవారు లోపలకి వెళ్ళలేరు. మతాలు బాణం గుర్తులు మాత్రమే. గమ్యం ఆత్మ సాక్షాత్కారం. ఎవరైనా ఓ చెట్టుకి ఉన్న పండుని వేలితో చూపిస్తే నువ్వు వేలు నించి ఆ పండు వైపు చూసి వెళ్ళి దాన్ని కోసుకుంటేనే ఆ ఫలాన్ని అనుభవిస్తావు. వేలు నించి దూరంగా చూడకుండా మీరంతా వేలు దగ్గరే ఆగిపోయారు. మీరంతా ఆ ఫలాన్ని